# మొక్కు

## పాలకూర సీతాలత

**గోవిందరావు**గొప్ప భక్తుడని చెప్పడానికి చాలా ఉదాహరణ లున్నాయి. అతను పని చేస్తున్నది నెల్లూరులోనే కావచ్చు. అక్కడికి తిరుపతి దగ్గరే కావచ్చు. అంతమాత్రాన కనీసం నెలకు రెండు సార్లు మొక్కు తీర్చుకుందుకు తిరుపతి వెళ్ళడం గొప్ప విషయమే. చూ సేవాళ్ళకు అతను మొక్కుకునే కారణాలుకూడా చాలా "సిల్లీగా తోస్తాయి. ఆ మాట అంటే అతను ఒప్పుకోడు.

'మేనేజరుగారు చండశాసనుడు. కనీసం ఆయన పది రోజులు ఊర్లో లేకపోయినా ప్రాణం తెరిపిగా ఉంటుంది. కనీసం ఆయన పది రోజులు సెలవులో వెళ్ళేలా చెయ్యి వెంకటరమణమూర్తీ. తిరుపతి వస్తాను' అంటాడు.

అదేం చిత్రమో, ఆ మేనేజరు పది రోజులు సెలవులో వెళ్ళాడు. ఆయన సెలవునుంచి రాగానే ఇతను సెలవు పెట్టి 'తిరుపతి' పోయి వస్తాడు. ఎందుకంటే, తిరుపతి వస్తానన్నాడు కనుక.

"అంతగా ఆ మేనేజరును భరించలేకపోతుంటే సెలవులో వెళ్ళాలని ఏం ఖర్మ? ఏకంగా బదలీ అయిపోయి వెళ్ళాలని కోరుకోవచ్చుగదా" అంటాడు అతని మిత్రుడు మధు.

"వద్దురా, పాపం. ఆయన కూతుర్లు ఇక్కడే చదువుకుంటున్నారు. ఆయన్ని సంవత్సరం మధ్యలో బదలీ చేస్తే కష్టం కదా,పాపం." అంటాడు గోవిందరావు.

ఆ ఆఫీసులో అందరూ ఒక నిర్ణయానికి వచ్చేశారు. 'ఈ గోవిందరావుని అర్థం చేసుకోవడం చాలా కష్టం.'

ఒకరోజు వాళ్ళ సెక్షనాఫీసరుగారికి జ్వరం వచ్చింది. ఆయన ముసలివాడు. మంచివాడు. అందరూ ఆయన్ని లైక్ చేస్తారు.

"పాపం, ఆయనకు జ్వరం వచ్చింది" అంటూ జాలి పడ్డాడు గోవిందరావు.

"అవును, పాపం" అంటూ వంత పాడారు మిగతా వాళ్ళు.

అందరి ముందూ అన్నాడు:

"ఆయనకు త్వరలో జ్వరం తగ్గిపోతే తిరుపతి వెళ్ళి వస్తాను."

అందరూ ఆశ్చర్యపోయారు. 'సెక్షనాఫీసరు అంటే ఎంత ఇష్టం ఉన్నా లీవు, డబ్బు ఖర్చు పెట్టుకుని తిరుపతి వెళ్ళి రావడం ఏమిటి? గోవిందరావుది అంత గొప్ప మనసా?' ప్రతివాళ్ళూ తన బంధువులే అన్న తీరులో ప్రవర్తించ గలగడం చాలా గొప్ప విషయం.

"ఎంత గొప్ప మనసురా నీది" అన్నాడు మధు. చిన్నగా నవ్వి ఊరుకున్నాడు గోవిందరావు.

మరొక నాలుగు రోజుల్లో సెక్షనాఫీసరుగారికి జ్వరం తగ్గడం, ఆయన ఆఫీసుకి రావడం జరిగాయి.

"నాలుగు రోజులకి సెలవు కాగితం..." అంటూ లీవు లెటరు ఇచ్చాడు గోవిందరావు సెక్షనాఫీసరుకి.

"ఏం పని?" అన్నాడు ఆయన.

గోవిందరావు చెప్పాడు. సెక్షనాఫీసరు కరిగిపోయాడు.

"నా కోసం మొక్కుకున్నావా? ఎంత మంచివాడివి! బహుశా నీ మొక్కు వల్లే నేను బాగైపోయాను కాబోలు. వెళ్ళిరా. లీవు వేస్టు చేసుకోకు. "సి.ఆఫ్.ఇస్తాను" అన్నాడు ఆయన సంతోషంగా.

అలా నాలుగు రోజులు కాంపెన్ సేటరీ ఆఫ్ తీసుకుని తిరుపతి వెళ్ళి వచ్చాడు గోవిందరావు.

ఆ ఆఫీసులోనే రిటైరు కావడానికి "సిద్ధంగా ఉన్న ఒక గుమాస్తా ఉన్నాడు. ఆయన తన కొడుక్కి ఉద్యోగం దొరకాలని తెగ ప్రయత్నిస్తున్నాడు. ఆ కుర్రవాడు ఈ మధ్యే ఒక ఇంటర్వ్యూకి వెళ్ళి వచ్చాడు.

"ఎలా చేశాడండీ మీ అబ్బాయి ఇంటర్వ్యూ?" అడిగాడు గోవిందరావు.

"బాగానే చేశా నన్నాడు. ఉద్యోగం వస్తే బాగుండును" అన్నాడు ఆ గుమాస్తా.

"అవునండీ.. మీ కొక బాధ్యత తీరిపోతుంది. సుఖంగా ఉండొచ్చు. మీ అబ్బాయికి తప్పకుండా ఈ ఉద్యోగం రావాలని కోరుకుంటున్నాను. మీ అబ్బాయికి ఉద్యోగం వస్తే నేను తిరుపతి వెళ్ళి వస్తాను" అన్నాడు గోవిందరావు.

ఆ గుమాస్తా ఆశ్చర్యపోయాడు.

"అవునండీ. మీ అబ్బాయికి ఉద్యోగం రావడం చాలా ముఖ్యం. అది మీకు ఆనందదాయకం అవుతుంది. మీ ఆనందమే నాకు ఆనందం" అన్నాడు గోవిందరావు.

ఆ గుమాస్తా ఆశ్చర్యంలోంచి తేరుకోకుండానే -"ఎంత దొడ్డ మనసు నీది" అన్నాడు.

ఆ తరవాత ప్రతి రోజూ వాళ్ళ అబ్బాయి గురించి ప్రశ్నించేవాడు గోవిందరావు.

ఒక రోజు ఆ గుమాస్తా శుభవార్త తీసుకుని వచ్చాడు.

"మాఅబ్బాయికి ఉద్యోగం వచ్చింది. అందుకు కారణం ఇండైరెక్టుగా నువ్వే కావచ్చు"అంటూ మెచ్చుకున్నాడు ఆ గుమాస్తా.

ఆ మర్నాడు నాలుగు రో జులకి సెలవు రా "సి సెక్షనాఫీసరుకి ఇచ్చాడు.

ఆయన దాన్ని చదవకుండానే"తిరుపతి వెళ్ళాలా?" అన్నాడు.

"అవునండీ" అన్నాడు.

ఆ గుమాస్తా గారు గోవిందరావుతో."నీకు దారి ఖర్చులు ఇస్తాను. మాఅబ్బాయికి ఉద్యోగం వచ్చినందుకే కదా ఈ మొక్కు తీర్చుకుందుకు వెళ్తున్నావు" అన్నాడు.

"వద్దండీ. ఇందుకోసం మీరు ఖర్చు పెట్టడం ఎందుకు?" అన్నాడు గోవిందరావు.


"కాదనకు. నా సంతోషం కొద్దీ చేస్తున్నాను. ఈ సొమ్ము ఉంచు" అంటూ డబ్బు ఇచ్చాడు ఆయన.

"మీ మాట కాదంటే బాధ పడతారని తీసుకుంటున్నాను" అన్నాడు గోవిందరావు మొహమాట పడుతూ.

తిరుపతి వెళ్ళి వచ్చాడు.

గోవిందరావుకి సంవత్సరంలో ఉన్న పన్నెండు కాజువల్ లీవులు, నెల ఎర్న్డ్ లీవులు, పదిహేను కమూటెడ్ లీవులు ఇందుకోసమే- కేవలం తిరుపతి యాత్రకే- ఖర్చు అవుతున్నాయి. ఇందులో అతిశయోక్తి లేదు.

ఒక్కొక్కసారి మధుకి అనిపిస్తుంది- 'గోవిందరావులాంటి వ్యక్తులు లోకంలో అరుదు. ఇతరుల కష్టాల్ని తన కష్టాలుగా భావించే మహానుభావుడు. అలాంటివాడు ఈ కలి యుగంలో ఉండటం ప్రజలందరూ చేసుకున్న అదృష్టం తప్ప మరేం కాదు.'



ఒకసారి మాటల సందర్భంలో సెక్షనాఫీసరు అన్నాడు:

"అందచందాల్లో లోటు లేదు. కట్నంకూడా బాగానే ఇయ్యడానికి సిద్ధపడ్డాను. అయినా, ఇంతవరకూ వచ్చిన ఆరు సంబంధాలలో ఏ ఒక్కటీ కుదరలేదు మాఅమ్మాయికి. మొన్న మరొకరు వచ్చి చూసుకుని వెళ్ళారు. ఏమవుతుందో తెలీదు."

"ఏం బెంగ పడకండి సార్. ఈ సంబంధం తప్పకుండా కుదురుతుంది" అన్నాడు గోవిందరావు.

గోవిందరావు వైపు ప్రేమగా చూశాడు ఆయన.

"ఏదో,నాయనా. నీ నోటి చలువ వల్ల అదే జరిగితే అంతకన్నా ఆనందం ఏముంది?"

గోవిందరావు అన్నాడు:

"నాకు అలా అనిపిస్తోంది, సార్. మీ అమ్మాయికి పెళ్ళి కుదరడం ఖాయం. తిరుపతి వెంకన్న వెంకటరమణే కాదు, సంకటహరుణుడుకూడా. మీ అమ్మాయికి ఈ సంబంధం కుదిరితే నేను తిరుపతి వెళ్ళి వస్తాను."

సెక్షనాఫీసరుగారి ముఖం వికసించింది.

'ఆ కుర్రవాడి వివరాలు ఏమిటి' అని అడిగి వివరాలన్నీ తెలుసుకున్నాడు గోవిందరావు.

ఒక వారం రోజులపాటు మాట్లాడలేదు కానీ, ఆ తరవాత ప్రతి రోజూ-"ఏమండీ, వాళ్ళు ఉత్తరం ఏమైనా రాశారా?" అని అడగసాగాడు గోవిందరావు.

"లేదయ్యా. నా కన్నా నువ్వే ఎక్కువ ఆత్రంగా ఉన్నావే" అన్నాడు సెక్షనాఫీసరు నవ్వుతూ.

"అవును, సార్. మీ మంచి నా మంచి."

"నీ మంచితనం నాకు తెలుసునోయ్. తన, పర అనే భేదాలు నీకు లేవు"అన్నాడు ఆయన పొంగిపోతూ.

మరొక నాలుగు రోజులు గడిచిపోయాయి. అయిదవ రోజు ఆయన స్వీట్స్ పాకెట్ తీసుకొచ్చి ముందుగా గోవిందరావుకి ఒక లడ్డూ ఇచ్చాడు.

"ఏమిటి, సార్, ఇది?" అన్నాడు గోవిందరావు అర్థంకాక.

"మాఅమ్మాయి వాళ్ళకి నచ్చిందటోయ్. వాళ్ళు కోరిన కట్నంకూడా నేను ఇయ్యగలిగినంతే. రేపే బయలుదేరి వెళ్తాను. తాంబూలాలు పుచ్చుకుంటాం" అన్నాడు ఆయన సంతోషంతో.

"చాలా బాగుంది. వెళ్ళి రండి. మీరు వచ్చాక నేను తిరుపతి వెళ్ళి వస్తాను" అన్నాడు గోవిందరావు.

"అలాగే. అలాగే" అనన్నాడు ఆయన.

ఆయన వెళ్ళి ఆ తాంబూలాలు ఇచ్చుకునే కార్యక్రమం ముగించుకునీ వచ్చాడు. ఆ మర్నాడే బయలుదేరి వెళ్ళిపోయాడు గోవిందరావు తిరుపతికి. సెక్షనాఫీసరుగారు బలవంతం చేసి, తన సంతోషం కొద్దీ ఇస్తున్నా నంటూ గోవిందరావుకి దారి ఖర్చులు ఇచ్చాడు.

గోవిందరావు గురించి చండశాసనుడైన మేనేజరకి ఏమీ తెలియదు. ఈ విషయాల గురించి అసలు తెలియదు.

ఆయన ఒక రోజు బాత్‌రూమ్‌లో కాలు జారి పడ్డాడు. కాలు బెణికింది. ఆ బెణుకు కాలుతో మేడ ఎక్కుతూ జారి పడ్డాడు. కాలు విరిగింది. బాండేజి కట్టి ఇంట్లో కూర్చో బెట్టారు. ఆఫీసులో వాళ్ళందరూ సానుభూతి ప్రకటించడానికి వెళ్ళారు. వాళ్ళలో గోవిందరావు ఉన్నాడు.

"బాండేజి కట్టారు కానీ, ఎముక అతుక్కుంటుందో, లేదో అని డాక్టర్లే విచారంగా చెప్తున్నరు. వయసు మీరడమే అందుకు కారణం అట. నాకు మాత్రం భయంగా ఉంది" అన్నాడు ఆయన బాధ పడుతూ.

మిగతా అందరూ ఆయన బాధలో భాగం పంచుకున్నారు. 'పాపం' అని జాలిపడి ఊరుకున్నరు.

గోవిందరావు మాత్రం."అదేం లేదు. తప్పకుండా మీ ఎముక అతుక్కుంటుంది. నాకు అలా అనిపిస్తోంది" అన్నాడు.

తనకు ధైర్యం చెప్తున్న గోవిందరావు వంక ప్రేమగా చూశాడు మేనేజరు.

"మీ ఎముక అతుక్కోవాలి. అతుక్కుంటే నేను తిరుపతి వెళతాను" అన్నాడు గోవిందరావు.

మేనేజరు ఆశ్చర్యపోయాడు.

అక్కడ ఉన్న ఒక రిద్దరు గోవిందరావు గురించి చెప్పారు. అతను తరుచు ఇలా అంటూ ఉంటాడనీ, అవన్నీ నిజం అవుతాయనీ, ఆ తరవాత అతను తిరుపతి వెళ్తాడనీ అన్ని విషయాలూ చెప్పారు.

మేనేజరు సంతోషపడిపోయాడు. గోవిందరావుకు ఉన్న మంచితనాన్ని పొగిడాడు.

"అలా అనకండి,సార్. ఆఫీసులో ఉన్న అందరూ నా వాళ్ళే" అన్నాడు గోవిందరావు.

దానితో గోవిందరావుమీద మరింత గొప్ప అభిప్రాయం ఏర్పడిపోయింది.

"చూద్దాం. అన్నింటికీ ఆ భగవంతుడే ఉన్నాడు" అన్నాడు ఆయన.

"మీ రేం అధైర్య పడకండి. గోవిందరావు పలుకులు అక్షర సత్యాలు అవుతాయి" అన్నాడు సెక్షనాఫీసరు. ఆయనకు ఇలాంటి అనుభవం రెండు సార్లు అయింది కదా.

రెండు నెలలు గడిచాయి. మేనేజరుకి పూర్తిగా బాగై పోయింది.

ఆయన ఆఫీసుకి వచ్చిన రోజున అందరూ అభినందించారు.

గోవిందరావుకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

"మీకు బాగైంది. నేను తిరుపతి వెళ్ళాలి" అన్నాడు గోవిందరావు.

"అవునవును. ఏదో వంక మీద నిన్ను ఆ ఊరు టూరుమీద పంపుతాను. సెలవు పెట్టక్కర్లేదు. పైగా దారి ఖర్చులు, డి.ఎ.కూడా దొరుకుతాయి" అన్నాడు ఆయన.

"థాంక్యూ, సార్" అన్నాడు గోవిందరావు.

ఆ మర్నాడే అతను టూరు మీద తిరుపతి వెళ్ళిపోయాడు. ఈ సారి అక్కడ వారం రోజులు ఉన్నాడు. ఆలస్యం ఎందుకైందని ఎవ్వరూ అడగలేదు. మేనేజరుకూడా.

గోవిందరావుకి ఆఫీసులో రోజు రోజుకీ పెరుగుతున్న పరపతిని గుర్తించాడు మధు. పైగా గోవిందరావు మాట నెమ్మది, మంచితనం, సత్ప్రవర్తన అతను ఎరుగనివి కావు.అతని కొక పెళ్ళి కావల్సిన చెల్లెలు ఉంది. 'ఆమెను ఇచ్చి గోవిందరావుతో పెళ్ళి చేస్తే?' ఆలోచన చాలా బాగుందనుకున్నాడు. ఆచరణలో పెట్టాలనుకున్నాడు.

అందుకే ఒక రోజు ఆఫీసులోనే గోవిందరావు దగ్గరకు వచ్చి ఆ విషయం కదిపాడు.గోవిందరావు ఆశ్చర్యపోయినట్లు ముఖం పెట్టాడు. ఆ తరవాత తేరుకుని-"సాయంత్రం ఒకసారి మా రూముకి రాకూడదూ?" అన్నాడు.

"అలాగే" అన్నాడు మధు.

'గోవిందరావు తప్పకుండా తన చెల్లెల్ని పెళ్ళి చేసుకుంటాడు. ఏదైనా అభ్యంతరం ఉంటే వెంటనే చెప్పేసి ఉండేవాడు. రూముకు రమ్మని పిలిచాడంటే అర్థం దాని గురించి వివరంగా మాట్లాడడానికే అయ్యుంటుంది' అనుకున్నాడు మధు.

ఆ సాయంత్రం మధు గోవిందరావుని కలిశాడు వాళ్ళ రూములో.


"రా- కూర్చో" అన్నాడు గోవిందరావు.

లోపలకు వెళ్ళి రెండు కప్పుల్లో కాఫీ తీసుకువచ్చి ఒకటి మధుకి ఇచ్చాడు.తిన్నగా రంగంలోకి దిగిపోయాడు గోవిందరావు.

"నీకు నా మీద ఉన్న సదభిప్రాయానికి కృతజ్ఞతలు. కానీ, నేను పెళ్ళి చేసుకుందుకు అనర్హుడిని" అన్నాడు గోవిందరావు.

"అదేం? నీ కేం తక్కువ?" అన్నాడు మధు.

"తక్కువని కాదు. ఎక్కువని. నాకు పెళ్ళి అయింది."



ఆశ్చర్యపోయాడు మధు. గోవిందరావు ఈ ఊరికి బదలీ అయి వచ్చి ఏడాది అయింది. ఈ ఏడాదిగా ఒక్కడే ఉంటున్నాడు. అందుకే అతణ్ణి తను 'బ్రహ్మచారి' అనుకున్నాడు. పైగా గోవిందరావుకూడా ఏ నాడూ తనకు పెళ్ళి అయిందన్న విషయం చెప్పలేదు: ఎందుకు? భార్యా భర్తల మధ్య ఏమైనా గొడవలున్నాయా?

ఆ విషయమే అడిగాడు మధు.

"లేదు. మా ఇద్దరి మధ్యా ఎంత మాత్రం పొరపొచ్చాలు లేవు. పైగా నా భార్య అంటే నాకు అమితమైన ఇష్టం"

"అయితే, మరి..."నీళ్ళు నమిలాడు మధు.

"అర్థం అయింది నీ సంశయం. ఆమె ఉద్యోగం చేస్తోంది వేరే చోట. పెళ్ళికి ముందే మాఇద్దరి మధ్యా ఒక ఒప్పందం కుదిరింది. కనీసం రెండు సంవత్సరాలు ఆమెను నేను ఉద్యోగం చెయ్యనియ్యాలి. ఆమె సంపాదనలో నేను ఒక పైసాకూడా తీసుకోను. తండ్రి పోయిన తన కుటుంబాన్ని ఆమె ఆదుకుంటోంది. ఆమె తమ్ముడు ఉద్యోగస్థుడయ్యే వరకూ ఆమె ఉద్యోగం చెయ్యాలి" అన్నాడు గోవిందరావు.

"వెరీగుడ్! నిన్ను చూసి గర్విస్తున్నాను. పెళ్ళి జరిగాక భార్య సంపాదనమీద హక్కు అంతా తనదే అనుకుంటాడు భర్త. అలా కాకుండా ఆమెకు స్వాతంత్ర్యం ఇచ్చావు. నిన్ను అభినందిస్తున్నాను" అన్నాడు మధు మనఃస్ఫూర్తిగా.

"థాంక్యూ" అన్నాడు గోవిందరావు.

"అది సరే. నీ భార్య ఉద్యోగం చేస్తున్న ఊర్నించి ఇక్కడికే బదలీ చేయించుకుని మీ భార్యా భర్తలు ఇద్దరూ కలిసే ఉండొచ్చు కదా" అన్నాడు మధు.

"నిజమే. ఆ ఆలోచన నాకు లేకపోలేదు. కానీ, మా ఆవిడ పని చేస్తున్న కంపెనీ ఆ ఒక్క చోటే ఉంది. వేరే ఊళ్ళలో లేదు. చిన్న కంపెనీ అది. ఆ ఊళ్ళో మన ఆఫీసు బ్రాంచి లేదు. నేనే అక్కడకు వెళ్ళడానికి..." అన్నాడు గోవిందరావు.

"ఏ ఊరది?"

"తిరుపతి" అన్నాడు గోవిందరావు.

ఉలిక్కిపడ్డాడు మధు. తి-రు-ప-తి-

"తిరుపతా?"

"అవును. తరుచు అందుకే ఆ ఊరు ఏదో ఒక వంక పెట్టుకుని వెళ్తాను. కేవలం నా భార్యను చూడడానికి... ఆమెతో కలిసి ఉండడానికి."

మధు ఇంకా తేరుకోలేదు. ఏదో ఆలోచిస్తూనే ఉన్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అడిగాడు గోవిందరావు.

"అబ్బే, ఏం లేదు" అన్నాడు మధు తేరుకుని.

"నువ్వు ఏం ఆలోచిస్తున్నావో నాకు తెలుసు. ఇంత చెప్పిన నేను నీకు ఆ విషయంకూడా చెప్తాను. చీటికీ మాటికీ అందరి గురించీ తిరుపతి వెళ్తాననడం దీనికోసమే. ఇదివరకు నేను పని చేసిన బ్రాంచిలో ఇలా నెలకు రెండు సార్లు వెళ్తుంటే అందరూ ఏడిపించేవారు. 'నీ భార్య నిన్ను చెంగున కట్టుకుందిరా' అని ఒకరూ, 'పెళ్ళాం చేతిలో కీలుబొమ్మ' అని మరొకరూ అనేవారు. నిజానికి వాళ్ళు దాంపత్య జీవితం గురించి సరైన అవగాహన లేక అలా అంటున్నారని నాకు తెలుసు. అయినా, ఎందుకో ఆ మాటలు నాకు బాధ కలిగించేవి. అప్పుడే నాకు ఈ ఊరు బదలీ అయింది. కనక మీకు ఎవ్వరికీ ఈ విషయాలు తెలియవు. నేను చెప్పలేదుకూడా. అందుకే తిరుపతి వెళ్ళడానికి ఏదో ఒక వంక అవసరం అయింది. అందుకే అందరి గురించీ మొక్కుకుంటున్నట్లు ప్రవర్తించే వాడిని. అలా చెయ్యటం వల్ల ఇతరుల దృష్టిలో మంచి అభిప్రాయం ఏర్పడిపోయింది" అన్నాడు గోవిందరావు.

"కానీ, నువ్వు చెప్పిన వన్నీ జరిగిపోవడం ఆశ్చర్యమే" అన్నాడు మధు.

"అందులో ఆశ్చర్యం ఏం లేదు. మేనేజరుగారు పది రోజుల సెలవులో. వెళ్తున్నాడని నాకు ముందే తెలిసింది. అందుకే ఆయన సెలవులో వెళ్తే తిరుపతి వెళ్తానన్నాను. వెళ్ళి వచ్చాను. సెక్షనాఫీసరుగారి ఆరోగ్యం దెబ్బతింది. ఆయనకు బాగైతే తిరుపతి వెళ్తానన్నాను. ఆయన ఇంటికి వెళ్ళి మందులు శ్రద్ధగా వేసుకోమని చెప్పాను. అందువల్ల ఆయన రోగం తగ్గింది. ఆ తరవాత తిరుపతి వెళ్ళాను. అందుకోసం ఆయన కాంపన్ సేటరీ ఆఫ్ ఇచ్చాడు. గుమాస్తాగారి అబ్బాయికి ఉద్యోగం వస్తే తిరుపతి వెళ్తానన్నాను. వచ్చింది. అందులో నా ప్రయత్నం లేదు. ఆయన దారి ఖర్చులు ఇస్తే వెళ్ళి వచ్చాను. సెక్షనాఫీసరుగారి అమ్మాయికి పెళ్ళి కుదిరితే తిరుపతి వెళ్తానన్నాను. ఆయన్ని వివరాలు కనుక్కుంటే ఆ పెళ్ళికొడుకు నా మిత్రుడే అని తేలింది. వాడికి నచ్చచెప్పాను. పెళ్ళి కుదిరింది. ఆయన ఖర్చుతో తిరుపతి వెళ్ళాను. మేనేజరుగారి ఎముక అతుక్కుంటే తిరుపతి వెళ్తానన్నాను. అతుక్కుంది. ఆయన టూరుమీద పంపాడు. ఇలా చెయ్యడం వల్ల చాలాసార్లు సెలవు, దారి ఖర్చులు కలిసి వచ్చాయి. ఏ పని జరగడానికైనా 50 శాతం అవకాశాలు ఎప్పుడూ ఉంటాయి. ఉదాహరణకు మేనేజరుగారి ఎముక అతుక్కోవచ్చు; లేదా అతుక్కోకపోవచ్చు. నా అదృష్టం కొద్దీ చెప్పిన వన్నీ జరిగాయి. ఇందులో నా గొప్పలేదు" అన్నాడు గోవిందరావు.

"చాలా తెలివైన వాడివి. ఈ రకంగా ప్రవర్తించి వచ్చే లాభాలన్నీ సొంతం చేసుకున్నావు. బాగుంది. అయితే, ఇన్ని సార్లూ దేముడి దర్శనం చేసుకున్నా వన్న మాట" అన్నాడు మధు.

"లేదు. ఎన్నిసార్లు వెళ్ళినా దేముడి దర్శనం ఒక్కసారికూడా చేసుకోలేదు. దేవి దర్శనం మాత్రం చేసుకున్నాను. 'దేవి' నా భార్య పేరు. చిన్నగా నవ్వాడు గోవిందరావు.

"అరె, పాపం కదూ..." అన్నాడు మధు భయంగా.

"లేదు. నాకు పాపం రాదు. ఎందుకంటే నేను ప్రతిసారీ 'తిరుపతి వెళ్తాను' అని మాత్రమే అనే వాడిని. దేవుణ్ణి దర్శించుకుంటాను' అని మాత్రం అనలేదు. తిరుపతి వెళ్ళేవాడిని. వచ్చేవాడిని. దట్సాల్" అన్నాడు గోవిందరావు.

"నిన్ను అభినందించకుండా ఉండలేను. చాలా గొప్ప బుర్ర నీది" అన్నాడు మెచ్చుకోలుగా మధు.

"నువ్వు నాకు ఆప్తుడివి కనక ఈ విషయాలన్నీ చెప్పాను. దయచేసి ఇంకెవరికీ చెప్పకు. ఇక ముందు నా 'తిరుపతి' ప్రయాణం ఇలాగే సాగనీ" అన్నాడు గోవిందరావు.

"అలాగే. డోంట్ వర్రీ. నేను ఈ మాట ఎవ్వరికీ చెప్పను." అభయం ఇచ్చాడు మధు.

ఒక నిమిషం మౌనం వహించాడు గోవిందరావు.

"మీ చెల్లాయి పెళ్ళి అవుతుంది- త్వరలోనే అవుతుంది. ఆ పెళ్ళి కాగానే నేను తిరుపతి వెళ్తాను" అన్నాడు గోవిందరావు.

'సరే' అనబోయి నవ్వేశాడు మధు.

మధు నవ్వుతూనే ఉన్నాడు, తెరలు తెరలుగా.

తెల్లబోయి చూశాడు గోవిందరావు. ★

